క్లుప్తంగా

వెంకయ్యస్వామికి ఆరాధనోత్సవం

మనుబోలు : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధనోత్సవాన్ని మనుబోలు బీసీకాలనీ సమీపంలోని వెంకయ్య స్వామి ఆలయంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు ఉదయం మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యావచనం, పంచామృతాభిషేకం నిర్వహించి వెంకయ్యస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. నదీ జలాలతో శిఖరానికి అభిషేకం గావించారు. భక్తులు కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పూజల చేశారు. భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. ప్రత్యేక పూజలు తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం బయట హోమ గుండం వేసి శాస్త్రోక్తంగా ధుని పూజ జరిపించారు. కల్యాణం, సంతానం కోసం భక్తులు నవధాన్యాలను హోమ గుండంలో వేసి వ్రతాలు ఆచరించారు. ఉభయకర్తలుగా ముంగర విజయభాస్కర్‌రెడ్డి–విజయమ్మ దంపతులు వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి పల్లకిసేవతో ఆరాధన మహోత్సవాలు ముగిశాయి.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

కోవూరు : కోవూరు ఇనమడుగు సెంటర్‌లో అట్లూరు సుబ్రహ్మణ్యం మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను డీసీఎంబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి కోవూరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. అనంతరం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ చైర్మన్ సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు చిరంజీవి, పార్టీ నేతలు మందా రవి, కందల గిరిబాబు, రమణయ్య, హరి, చింటు, చక్రి, మౌళీ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణేల స్వాహాపై ముమ్మర దర్యాప్తు

పొదలకూరు : చిట్టేపల్లి అంకమ్మతిప్ప వద్ద లభ్యమైన పురాతన బంగారు నాణేల స్వాహాలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాగా గురువారం అమరావతి నుంచి సెంట్రల్ ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా టాస్కింగ్ స్టాఫ్ వింజమూరు ప్రతాప్ స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చి కేసు వివరాలను సీఐ సంగమేశ్వరరావు వద్ద సేకరించారు. ప్రస్తుతం విచారణలో నిందితులుగా అంకయ్య, అమరన్, అజిత్‌లపై కేసు నమోదు చేసి రూ.15 లక్షల విలువైన బంగారు నాణేలతో పాటు నిందితులు చెన్నైలో అమ్మిన ఆభరణాలు ద్వారా వచ్చిన రూ.14 లక్షల నగదుతో వారు కొనుగోలు చేసిన ఆటో, పాతకారులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. విజయనగర కాలం నాటి నాణేలుగా పురావస్తుశాఖ వారు గుర్తించినట్లు తెలుస్తోంది.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

వెంకటాచలం : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 41వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. విశేష పుష్పమాలికలతో అలంకరించిన తెప్పపై వెంకయ్యస్వామిని కొలువుదీర్చి ఉత్సవం జరిపారు. అంగరంగ వైభవంగా సాగిన తెప్పోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. వేలాది సంఖ్యలో భక్తులు కోనేటి కట్టపై చేరడంతో పోలీసులు నలువైపులా గట్టి బందోబస్తు నిర్వహించారు. తెప్పోత్సవంతో వెంకయ్యస్వామి 41వ ఆరాధన మహోత్సవాలు ముగిశాయి.

ఎస్పీ పరిశీలన

వెంకయ్యస్వామి తెప్పోత్సవాన్ని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి గురువారం రాత్రి పరిశీలించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు, భక్తుల రద్దీ, భోజన వసతి, పార్కింగ్, తెప్పోత్సవ కార్యక్రమాలపై ఆలయ ఈఓతో ఆరాతీశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం తెప్పోత్సవం వద్ద పూజలు నిర్వహించారు.

పద్మనాభసత్రంలో ఫ్యామిలీ డాక్టర్

కొడవలూరు : మండలంలోని పద్మనాభసత్రంలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య బృందం వారు గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇద్దరు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. వైద్యాధికారి గీతా సాహితి, హెచ్‌ఎస్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ బి.శ్రీలత, హెచ్‌ఏలు సీహెచ్.సుధాకర్, టి.దొరసానమ్మ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

మనుబోలు : ఎడగారులో పంట సాగు చేస్తున్న రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ సూచించారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో ఆర్బీకే సిబ్బంది చేపట్టిన ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన గురువారం పర్యవేక్షించారు.

కౌన్సెలింగ్‌తో కాపురాలను చక్కదిద్దాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సాధ్యమైనంత వరకు కౌన్సెలింగ్‌తోనే కాపురాలను చక్కదిద్దాలని, కుదరని పక్షంలోనే కేసులు నమోదు చేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని దిశ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, కౌన్సెలింగ్ హాల్, సిబ్బంది పనితీరు, డ్యూటీల నియామకం, రికార్డుల నిర్వహణ, తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి దిశా నిర్దేశం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఫిర్యాదుదారులతో అమర్యాదగా వ్యవహరించినా.. అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, దిశ, మహిళా భద్రత చట్టాలు, టోల్ ఫ్రీ, సైబర్ నేరాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రిసెప్షన్ విభాగంలో ఉన్న ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఏఎస్పీ హిమవతి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వర్చువల్‌గా గురువారం సమావేశమైన ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ విధాన అమలు, తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, డీపీఓ సుస్మితారెడ్డి, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, హౌసింగ్ పీడీ నాగరాజు తదితరులు హాజరయ్యారు.

జీఐఎస్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల జియో ట్యాగింగ్ ప్రక్రియలో జిల్లా విద్యుత్ అధికారులు వెనుకబడి ఉన్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్‌ను విద్యుత్ భవన్ నుంచి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఐఎస్ ప్రక్రియను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో విద్యుత్ సర్వీసులను ఈ నెల 30లోపు ఇవ్వాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో నీటి సదుపాయం కోసం బోర్‌వెల్స్‌కు విద్యుత్ కనెక్షన్లను తక్షణమే ఇవ్వాలని, దీనికి సంబంధించిన సామగ్రి స్టోర్స్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఐఆర్డీఏ స్కానింగ్‌లోనే రీడింగ్ తీసి బిల్లులివ్వాలని, జిల్లాలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లను గుర్తించి వెంటనే మార్చాలని ఆదేశించారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని ఇస్లాంపేట, పెద్ద మసీదు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా అర్ధరాత్రి వేళ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. సామర్థ్యం కన్నా అధిక లోడ్‌ను రాత్రి వేళ వినియోగిస్తుండటంతో ఈ సమస్య తలెత్తుతోంది. సమస్య తాత్కాలిక పరిష్కారానికి గానూ అదనపు సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఈస్ట్ – 1 ఏఈ విజయ్ కుమార్ ఆదేశించారు. దీంతో పాత దాని స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు మెరుగైన సేవలు


చిన్నారికి వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బారకాసు): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో దివ్యాంగులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని కేంద్ర కన్వీనర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మూగ, వినికిడి లోపంతో స్పాస్టిక్స్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న ఎర్లీ ఇంటర్వెన్షన్ విద్యార్థిని ఫసీహాకు రూ.18 వేల విలువజేసే వినికిడి యంత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థిని తల్లిదండ్రులు షాకీర్‌హుస్సేన్, సఫియా పరిస్థితిని అర్థం చేసుకున్న ఐఆర్సీఎస్ తలసేమియా కో కన్వీనర్ పర్వీన్ తన బృంద సహకారంతో యంత్రాన్ని అందజేశారని వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సునీత కుమార్తె మేధస్వీ జన్మదినాన్ని పురస్కరించుకొని 75 మందికి అన్నదానం చేశారు. స్పాస్టిక్స్ కేంద్ర కో కన్వీనర్ బలరామయ్యనాయుడు, ప్రిన్సిపల్ గుర్నాథరావు, వైస్ ప్రిన్సిపల్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపండి


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్నకు చెబుదాం, స్పందనలో ప్రజలు అందించే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపి.. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్పందన ద్వారా అందిన సమస్యల పరిష్కారానికి గానూ క్షేత్రస్థాయిలో గురువారం ఆయన పర్యటించారు. పెద్ద పోస్టాఫీస్, మధ్వపతి వారివీధి, గుడపల్లిపాడు, నేతాజీనగర్ ప్రాంతాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించనున్న ఆహా క్యాంటీన్ల ఏర్పాటు కోసం వైఎమ్సీఏ మైదానం, తదితర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ నీలి రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ సోదరుడు రవికుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పొదలకూరు రోడ్డులోని శాంతినగర్‌లో గల తన నివాసంలో ఈ నెల 18న మృతి చెందారు. ఈ క్రమంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కాంగ్రెస్ నేతలు శేషారెడ్డి, రఘురామ్ ముదిరాజ్, సురేష్‌బాబు, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజన్న భవన్‌లో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను రాష్ట్ర ముస్లిం స్వర్ణకారుల సంఘ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఖాదిరి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. స్వర్ణకారులకు విద్యుత్ బిల్లుల్లో రాయితీని కల్పించి వారి జీవనోపాధికి తోడ్పాటునందించాలని కోరారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద స్వర్ణకారుల కాంప్లెక్స్‌ను నిర్మించి ఉపాధి అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ కనెక్షన్లు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్మించిన జగనన్న కాలనీలో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలను ఈ నెల 29న నిర్వహించేలా అన్ని వసతులను కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. దీంతో విద్యుత్ అధికారుల ఆదేశాలతో 600 సర్వీస్ కనెక్షన్లను ఏర్పాటు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

మనుబోలు : ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల జాప్యం వల్ల పేదలు నష్టపోతున్నారని, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయని కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2018–19 సంవత్సరాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు పడలేదని హౌసింగ్ ఏఈ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో మూడో విడత నాడు–నేడు కింద 16 పాఠశాలలు ఎంపికయ్యాయని, డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలలకు పంపేలా ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన పోలీస్ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. పోలీస్ కాలనీ తొమ్మిదో వీధిలో కామాక్షి, మనోహర్‌రెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌గా కామాక్షి.. ప్రైవేట్ టీచర్‌గా మనోహర్‌రెడ్డి పనిచేస్తున్నారు. తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో కొంతకాలంగా సాలుచింతలలో ఉంటూ భార్య వద్దకు వచ్చి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఉద్యోగానికి కామాక్షి మంగళవారం వెళ్లారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో తన కుమారుడితో కలిసి పోలీస్ కాలనీ ఐదో వీధిలో ఉంటున్న తల్లితండ్రుల వద్దకెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. పడక గదిలోని బీరువాను పగలగొట్టి అందులో ఉన్న సుమారు ఆరున్నర సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఇంటికి గురువారం ఉదయం వచ్చిన బాధితురాలు చోరీ జరిగిందనే అంశాన్ని నిర్ధారించుకొని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం రేపు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర సాయిమాత నిత్యాన్నప్రసాదాలయ ద్వారకామాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి నామ సంకీర్తన, అన్నప్రసాదాన్ని అందజేయనున్నామని చెప్పారు. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు. సాయి భక్త బృంద సభ్యులు జితేంద్ర, సుబ్రహ్మణ్యం, సుభాష్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అఖండ వేదపారాయణ సప్తాహం


ఉపన్యసిస్తున్న కుటుంబశాస్త్రి

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ వేదపారాయణ సప్తాహం గురువారంతో ముగిసింది. శృంగేరి పీఠ ఉత్తరాధీశ్వరుడు విదుశేఖర భారతిస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఇరగవరం వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో చక్రాల వారి ట్రస్ట్ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని జరిపారు. అఖండ వేదపారాయణ సప్తాహ నిర్వహణపై వెంపటి కుటుంబశాస్త్రి ఉపన్యసించారు. పర్యవేక్షకుడు చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, వేదపండితుడు మద్దూరి ఆంజనేయసోమయాజీ, చుండి సుబ్రహ్మణ్యం, ఆనందకుమార్, వెంకటశ్రీధర్‌శర్మ, మల్లవరపు లక్ష్మీనరసింహ, శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.